# నవ వసంతానికి నాంది

**ఉగాది**

**శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు**

కూకట్‌పల్లి నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం కనులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయాలు, కాలనీల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది రోజులు భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను దర్శించుకుని అర్చకుల నుంచి ఆశీర్వచనం పొందారు. ప్రజలు తమ ఇళ్లలో ఉగాది పర్వదినాన పూజలు చేసి ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. – కూకట్‌పల్లి





ఉమామహేశ్వర ఆలయంలో భగవద్గీతను అందజేస్తున్న సాయిదర్శిని ప్రతినిధులు







## క్లుప్తంగా

### నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

**భాగ్యనగర్‌కాలనీ:** బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం హెచ్‌ఎంటీ కమ్యూనిటీహాలులో గురువారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి హైదర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటి మెంబర్లు, ఉద్యమకారులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భద్రత పెంచండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భద్రత పెంచాలని బీఎస్పీ, బీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో జరిగిన ముఖ్యనేతల సమావేశం అనంతరం బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్ చౌహాన్, బీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రాణహానీ ఉందని ఆయనకు ఏమైనా జరిగితే రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని హెచ్చరించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై ఎవరు మాట్లాడినా అణచివేస్తున్నారని ఇటీవల ఆమరణదీక్ష చేపడితే భగ్నం చేసి అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని తొలగించే వరకూ ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రవీణ్ కుమార్‌కు వెంటనే సెక్యూరిటీ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మేందర్, దయాకరన్ మౌర్య, అంబేడ్కర్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

### ఎల్‌ఓసీ అందజేత

**సనత్‌నగర్:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్న అన్ని రకాల వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌కు చెందిన రాథోడ్ జైసింగ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం మంత్రి తలసాని చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2.50 లక్షలు మంజూరు కాగా బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో బాధితుడి కుమారుడికి ఎల్‌ఓసీ పత్రాన్ని మంత్రి అందజేశారు.

## క్రైం కార్నర్..

### భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

**మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు**



మృతి చెందిన శుభం కుచ్‌లాబే

**కుత్బుల్లాపూర్:** ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శుభం కుచ్‌లాబే (26), సీమ దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. వీరికి కుషాల్ (02), ప్రఫూల్ (4 నెలలు) ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా శుభం జీడిమెట్ల పైపులైన్ రోడ్డులోని ఎస్‌వీసీ కన్‌స్ట్రక్షన్స్‌లో మేస్త్రీగా పని చేస్తున్నాడు.

- ఈ నెల 20 తేదీన మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో భవనం 3వ ఫ్లోర్‌లో పని చేస్తున్న శుభం ప్రమాదవశాత్తు పై నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లోకి పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 21న మృతి చెందాడు. భవన నిర్మాణ యాజమాన్యం ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య సీమ ఆరోపించారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ఆదరణ



**మోతీనగర్:** మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో గత నెల రోజుల నుంచి కొనసాగిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శన గురువారంతో ముగియనుంది. ఈ మేళాలో ధర్మవరం, వెంకటగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాం వంటి చీరలతో పాటు జమ్ము కాశ్మీర్ ఎంబ్రాయిడరీ చీరలు మెటిరియల్స్ ప్రింటెండ్ శారీలు, చందేరి వంటి ఎన్నో రకాల చీరలు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా గృహోపకరణాలు, కొండపల్లి బొమ్మలు ఉన్నాయి. ఈ మేళా ప్రతి రోజు 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేనేత కళాకారులు తయారు చేసిన ఎన్నో రకాల వస్త్రాలు గృహోపకరణాలు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని పెన్షన్ అందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

## ధరణినగర్ కనకదుర్గమ్మ ఆలయం నూతన కమిటీ

**ఆల్విన్‌కాలనీ:** ఆల్విన్‌కాలనీ ధరణినగర్ కనకదుర్గ దేవాలయం నూతన కమిటీ బుధవారం ఎన్నికయ్యింది. అధ్యక్షుడిగా బి. మహేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.రాంబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా జి.విశ్వంబర్, జి.సత్యనారాయణ, జనరల్ సెక్రటరీలుగా పి.నాగార్జున చార్యులు, బి.సరిత, శ్రీరామమూర్తి, ట్రెజరర్‌గా శ్రీనివాస్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పి.మహేష్, ఎ. విశ్వనాథ్, శ్రీకాంత్, వరప్రసాద్, శ్రీనివాసాచారి, పి.మాధవరావు, నర్సిరెడ్డి, సలహాదారులుగా కె.రాజుయాదవ్, జి.గోపాల్, వి.ప్రేమ్‌దాస్, ద్వారకనాథ్‌రెడ్డి, బి.రాంప్రసాద్‌లు ఎన్నికయ్యారు.



ధరణినగర్ కనకదుర్గమ్మ ఆలయంలో నూతన కమిటీ సభ్యులు

## ‘నా ఫ్లాట్‌ను కిరాయికిచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారు’

- ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

**భాగ్యనగర్‌కాలనీ:** తనకు చెందిన అపార్టుమెంట్ ఫ్లాట్‌లో ఇతరులకు కిరాయికి ఇచ్చి బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై బుధవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లికి చెందిన సీహెచ్.బాలేష్ జి వాసవీ దగ్గర సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బాలేష్ యజమానురాలు ప్లాట్ నం.40, సర్వే నం.116/ఎ, వివేకానందర్‌నగర్ కాలనీ తీక్షా రెసిడెన్సీలో మూడు ప్లాట్లకు డవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నారు.

- 2022 డిసెంబర్ 24వ తేదీన రిజిస్టర్ సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్ పొంది యాజమాన్యపు హక్కులను పొందారు. అయితే తన యజమానులకు తెలియకుండా శంకర్ అనే వ్యక్తి రెండు ప్లాట్లను అక్రమంగా ఇతరులకు ఇచ్చి అద్దె వసూలు చేస్తున్నాడు. మరో ప్లాట్‌లో ఉడ్ వర్కు చేయిస్తున్నాడు. తన యజమానురాలి ప్లాట్‌లోకి వచ్చి అద్దె వసూలు చేసిన విషయమై శంకర్‌ను నిలదీయగా తాను గొట్టిముక్కల పద్మారావు అనుచరుడినని సుదర్శన్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డాడు.
- అపార్టుమెంట్ పరిసరాలకు మరోసారి రాకూడదని వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన యజమానురాలి ఫ్లాట్‌లో ఇతరులను పెట్టించి అక్రమంగా అద్దె వసూలు చేస్తున్న శంకర్, పద్మారావు, ఆయన అనుచరుడు సుదర్శన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి పోలీసులకు బాలేష్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గాయత్రికి ‘ఉత్తమ గళ మహిళ’ పురస్కారం

**సనత్‌నగర్:** ప్రముఖ డబ్బింగ్ కళాకారిణి, తన గళంతో రైల్వే సమాచారం అందించే వ్యాఖ్యత గాయత్రి ‘ఉత్తమ గళ మహిళ’ పురస్కారం అందుకున్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో బేగంపేట కుందన్‌బాగ్‌లో నిర్వహించిన ఉగాది, మహిళా దినోత్సవ వేడుకల్లో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. సమాజహితాన్ని కాంక్షించే వారిని గుర్తించి సత్కరించడం ఎంతో అవసరమని, ఇది ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. గాయత్రి గత మూడు దశాబ్దాలుగా డబ్బింగ్ కళాకారిణిగా ఎన్నో సినిమాలు, సీరియల్స్‌తో పాటు రైల్వేకు తన మధుర గాత్రాన్ని అందించడం ఎంతో అభినందనీయమన్నారు. మహిళా దినోత్సవాలు జరుపుకుంటున్న ఈ సమయంలో ప్రతిభావంతురాలైన మహిళను సత్కరించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. సినీ, టీవీ నటుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. గాయత్రి లాంటి ప్రతిభ గల ఆర్టిస్టులను గుర్తించి సత్కరిస్తే వారు ఆ రంగంలో మరింతగా రాణించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు, ఆకృతి సుధాకర్, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు జగన్నాథచారి, ప్రొఫెసర్ జోగాచారి పాల్గొన్నారు.



గాయత్రికి పురస్కారం అందిస్తున్న మధుసూదనాచారి

## యువత చూపు బీఆర్‌ఎస్ వైపు

**గచ్చిబౌలి:** యువత చూపు భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్)వైపు ఉందని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్, మాదాపూర్ డివిజన్‌కు చెందిన పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు యువత ఆకర్షితులవుతున్నారని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న దేశంలో ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

## కేలండర్ ఆవిష్కరణ



**మోతీనగర్:** ఉగాది పండుగ పురస్కరించుకొని రజక సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బీఆర్‌ఎస్ రాజు ఆధ్వర్యంలో తెలంగాణ రజక సంక్షేమ సంఘం కేలండర్‌ను బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అశోక్, బాలకృష్ణ, సైదులు, బాబురావు, రవి తదితరులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం

**బాలానగర్:** గుడికి వెళ్తున్నానని ఇంట్లో వాళ్లకి చెప్పి బయటకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం ... రాజు కాలనీలో ఎ. కిరణ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని కూతురు మానస (14) 9వ తరగతి చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో కిరణ్‌కుమార్ ఫోన్‌కు మానస మరో వ్యక్తి సుజిత్‌తో కలిసి దిగిన ఫొటో ఫోన్‌లో వచ్చింది. ఆ వ్యక్తి తన కూతురుని తీసుకొని వెళ్లి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి కిరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** కూకట్‌పల్లి డివిజన్ హనుమాన్ నగర్‌కు చెందిన రామ్‌నరేష్‌కు రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరయ్యింది. ఈ మేరకు సదరు చెక్కును ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఊట్ల చందారెడ్డి, తిరుపతి, రామాంజనేయులు, భాస్కర్, అమరేందర్‌రెడ్డి, జనార్ధన్, కనకయ్య, కుందన్ ప్రసాద్, సుకుదేవ్ ప్రసాద్, లీలాబాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో దీక్షకు రావాలని రేవంత్‌కు ఆహ్వానం

**ఉస్మానియా యూనివర్సిటీ:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటన పై ఓయూలో చేపట్టనున్న మహా నిరసన దీక్షకు రావాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని విద్యార్థి నేతలు ఆహ్వానించారు. బుధవారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రం ఇవ్వగా మొదటి రోజు (24న) హాజరవుతానని రేవంత్ హామీ ఇచ్చినట్లు విద్యార్థి నేతలు పేర్కొన్నారు.

## ఆర్ట్స్ కాలేజీ ఎదుట దీక్షలకు అనుమతి లేదు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభలు, సమావేశాలు, దీక్షలకు ఎలాంటి అనుమతి లేదని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. పాలక మండలి నిర్ణయం మేరకు రెండు సంవత్సరాలుగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. ఈ నెల 24, 25న నిర్వహించనున్న మహానిరసన దీక్ష తమ దృష్టికి రాలేదని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

## ఉజ్వల భవిష్యత్‌కు కేరాఫ్ సీఐటీడీ

- పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి మంచి వేదిక
- డిప్లమో కోర్సులు పూర్తి చేస్తే ఉద్యోగావకాశాలు మెండు
- నేరుగా బీటెక్ సెకండియర్‌లో చేరే వెసులుబాటు



బాలానగర్‌లోని సీఐటీడీ కార్యాలయం

**బాలానగర్:** పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఏ కోర్సు చదివించాలో అర్థం కాని పరిస్థితిలో తల్లిదండ్రులు చాలా మందిని సలహాలు అడుగుతూ ఉంటారు. ఇంటర్ ప్రైవేట్‌గా చదివించాలంటే ఫీజులు భరించలేం.. ప్రభుత్వ కళాశాలల్లో సరిపడా వసతులు ఉండవు. పిల్లలను ఎక్కడ చదివిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డైలామోలో ఉండే తల్లిదండ్రులకు బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో ఉన్న సీఐటీడీ మంచి వేదిక.

**పారిశ్రామికవేత్తలుగా స్థిరపడిన ఇక్కడి విద్యార్థులు**

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే విద్యాసంస్థ ఇది. దేశంలో 7 సంస్థలు ఉన్నాయి. అందులో తెలంగాణ రాష్ట్రంలో బాలానగర్‌లో ఒకటి ఉంది. 1968 సంవత్సరంలో ఏర్పాటైన సంస్థ ఎందరో మేధావులను అదించింది. ఇందులో చదివిన విద్యార్థులు పలువురు పారిశ్రామికవేత్తలుగా స్థిరపడ్డారు.

**వంద శాతం ఉద్యోగాలకు ఎంపిక**

ఇక్కడ డిప్లమో కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. 75శాతం ప్రాక్టికల్స్ ఉంటుంది. 25 శాతం థియరీ ఉంటుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది మంచి వేదిక. ఇంటర్ మీడియట్ జేఈఈ మెయిన్స్ అని లక్షల ఫీజులు కట్టడం కంటే ఇక్కడ తక్కువ ఫీజులో డిప్లమో పూర్తి చేయవచ్చు. ఆ తర్వాత ఉన్నత చదువులు చదవాలనుకుంటే బీటెక్‌కు ఎంట్రన్స్ పరీక్ష రాసి బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు. లేదనుకుంటే ఇక్కడ ప్లేస్‌మెంట్స్ ఉంటాయి. వందకు వంద శాతం ఇక్కడ ఉద్యోగాలకు ఎంపికవుతారు.

**ఇందులో చేరాలంటే ఎంట్రన్స్ పరీక్ష నెగ్గాల్సిందే..**

సీఐటీడీలో నాలుగు రకాల డిప్లమో కోర్సులు ఉన్నాయి. పదో తరగతిలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఎంట్రన్స్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్షలు ఉత్తీర్ణులైన వారిని మాత్రమే ఎంపిక చేస్తారు. డీటీడీఎం 4 సంవత్సరాల కోర్సు, డీఈసీఈ, డీఎఆర్‌ఈ, డీపీఈ 3 సంవత్సరాల కోర్సు, ఎంట్రన్స్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఒకొక్క విభాగంలో 60 సీట్లు ఉంటాయి. ఇటీవల దేశవ్యాప్తంగా నోటిఫికేషన్ విడుదలయ్యింది. వివరాలకు బాలానగర్‌లోని సీఐటీడీలో సందర్శించవచ్చు.

## వేడుకగా భోగ్ బండార్

దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డులో శంకర్ బావాలాల్ మహారాజ్ ఆధ్వర్యంలో మహా చండీయాగం, భోగ్ బండార్ నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో వేడుకలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. – దుండిగల్



తరలివస్తున్న బంజారాలు



పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ శంకర్ నాయక్

## 26 నుంచి మేడ్చల్ జిల్లాలో పర్యటన


**వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి**



**కుత్బుల్లాపూర్:** మేడ్చల్ జిల్లాలో వైఎస్సార్‌టీపీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఈనెల 26న నుంచి మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్, మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లోని డివిజన్లు, మున్సిపాలిటీల్లో పర్యటిస్తామన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు నివేదిస్తామని తెలిపారు. రాబోయే రోజులలో పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పర్యటన గురించి నాయకులు, కార్యకర్తలు, ప్రజలను చైతన్య పరిచి అధినేత్రి పర్యటనలను విజయవంతం చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. అందులో భాగాంగ నిర్వహించే ఈ పాదయాత్రల్లో జిల్లాలోని ఆయా అసెంబ్లీల కోఆర్డినేటర్లు, జిల్లా నాయకులు, అనుబంధ కమిటీల అధ్యక్షుడు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొని సహకరించాలని సురేష్‌రెడ్డి కోరారు.

## 30న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి హిందూ వాహిని బాగ్ తరపున బుధవారం ఉగాది పచ్చడి వితరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీన శ్రీరామనవమి పురస్కరించుకొని ఫతేనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పైపులైన్ రోడ్డు మీదుగా శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హిందూవాహిని రాష్ట్ర కోశాధికారి తొట్టదిల్లాయి చంద్రంజీ, రాంబాబు, కూకట్‌పల్లి బాగ్ సంయోజక్ శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, శివ, ఫతేనగర్ శాఖ అధ్యక్షుడు పవన్‌శేఖర్, సేహాల్, శ్రీను అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న హిందూ వాహిని నాయకులు

## కూలిన చెట్టు.. రాకపోకలకు అంతరాయం



బాలాజీనగర్ డివిజన్‌లో కూలిన చెట్టును కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

**కూకట్‌పల్లి:** ఇటీవల కురిసిన వర్షాల కారణంతో చెట్టుకూలి రోడ్డు మధ్యలో పడింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నాలుగు రోజులుగా సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆరోగ్య రెడ్డి మిత్రులు కూలిన చెట్టు కొమ్మలను నరికి పక్కన వేసి రోడ్డును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, హరినారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

జాతీయ రహదారిపై ఉన్న రాందేవ్‌రావ్ హాస్పిటల్ వద్ద సత్యవేద ఫౌండేషన్ ఫౌండర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి రంగారావు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నవీన్, ప్రవీణ్, ప్రసాద్, రమేష్ , విద్యాసాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. – ఆల్విన్‌కాలనీ

